అధునాతన వ్యవసాయం .. డ్రోన్ సాయం

- మందుల పిచికారిలో సాంకేతికత
- సాగులో ఖర్చు, సమయం ఆదా
- అన్ని రకాల పంటలకు అనుకూలం
- ఆసక్తి చూపుతున్న రైతులు

కాశినాయన : రైతులు ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. పాత సాగు విధానానికి స్వస్తి పలికి అధునాతన సాంకేతిక వ్యవసాయం చేస్తున్నారు. సేద్యంలో కొత్త ఒరవడితో అధిక దిగుబడులు సాధించేలా ఆలోచిస్తున్నారు. సాగు చేసిన పంటలకు తెగుళ్లు సోకితే డ్రోన్ ద్వారా రసాయనిక ఎరువులు పిచికారి చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. డ్రోన్ పరికరాలతో సరికొత్త సాంకేతికను జోడించి పిచికారి చేస్తూ సమయంతో పాటు ఖర్చును ఆదా చేస్తున్నారు. నష్టాలను అధికమించి ఆదాయం ఆర్జించేందుకు కృషి చేస్తున్నారు.

రైతులకు ఎంతో ప్రయోజనం

నియోజకవర్గంలో రబీ సీజన్‌లో వరి, మిరప, మొక్కజొన్న, అరటి, సజ్జ పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో కూలీల కొరత వలన డ్రోన్‌ల వినియోగం రైతులకు ఎంతో ప్రయోజనంగా మారింది. రసాయనిక మందులు


డ్రోన్‌తో రసాయనిక మందులను పిచికారి చేస్తున్న రైతులు

పిచికారి చేయడానికి డ్రోన్‌లను ఉపయోగించి ఖర్చును తగ్గించుకుంటున్నారు. 5 ఎకరాల పంటకు మందులు పిచికారి చేయాలంటే రూ.2 వేలు ఖర్చవుతుంది. దీంతో పాటు వేలాది లీటర్ల నీటితో పాటు సుమారు ఎనిమిది గంటల సమయం పడుతుంది. అదే డ్రోన్ సాయంతో మందులు పిచికారి చేస్తే గంటలోపు పూర్తి చేసుకోవచ్చు.

కూలీల కొరతతో అవస్థలు

పంటలు సాగు చేశాక వాటి సంరక్షణ ఎంతో కీలకం . పంటలు సాగు చేసిన 20 రోజుల నుంచే పురుగు మందులను పిచికారి చేయాల్సి వస్తుంది. అయితే మందులు పిచికారి చేసేందుకు కూలీలు దొరకడం లేదు. సకాలంలో పంటకు మందులు పిచికారి చేయకపోతే సాగులో నష్టాలను చవి చూడాల్సి వస్తుంది. అంతేకాక కూలీలతో మందులను పిచికారి చేయడం ఖర్చుతో కూడుకున్న పని. దీంతో సాగులో పెట్టుబడులు పెరిగి దిగుబడులు అందక రైతులు నష్టాలు చవి చూస్తున్నారు.

ఖర్చుతో పాటు సమయం ఆదా

పంటల సాగులో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి తద్వారా సాగులో ఖర్చుతో పాటు సమయం ఆదా చేసుకోవచ్చు. అనుకున్న సమయానికి పంటలకు మందులను పిచికారి చేయవచ్చు. ఇందుకు ఎకరాకు రూ.500 తీసుకుంటున్నారు. అయితే కూలీలతో మందులు పిచికారి చేసేందుకు ఎకరాకు కూలీలకు వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుంది. ఎక్కువ సమయం పడుతుంది. దీంతో రైతులు డ్రోన్ల వినియోగంపై ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రత్యేక శిక్షణ



డ్రోన్ ద్వారా పంటలకు పురుగు మందులు పిచికారి చేయడానికి సమయంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుంది. గతంలో మండలానికి ఇద్దరు రైతులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. వారికి 50 శాతం రాయితీతో ప్రభుత్వం డ్రోన్లను అందించనుంది. పంటలకు మందులను పిచికారి చేసుకోవాల్సిన రైతులు వారి వద్ద నుంచి డ్రోన్లను అద్దెకు పొందవచ్చు. త్వరలో శిక్షణ తీసుకున్న వారికి రెండు, మూడు నెలల్లో కార్యాచరణ పూర్తి కానుంది.

–జయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి, కాశినాయన మండలం

నేడు అ'పూర్వ' కలయిక

ప్రొద్దుటూరు కల్చరల్ : 41 ఏళ్ల కిందట విడిపోయిన పూర్వ విద్యార్థులు మళ్లీ కలుసుకోవడానికి స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ వేదికకానుంది. 1983–84వ విద్యా సంవత్సరంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు హైస్కూల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులందరూ తప్పక హాజరై ఆనాటి మధుర జ్ఞాపకాలను, అనుబంధాలను పంచుకోవాలని కోరారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


మృతిచెందిన తిరుపాల్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శనివారం ఓ వ్యక్తి మృతి అనుమానాస్పదంగా చెందాడు. స్థానికులు మృతుని వద్ద ఆధారాలు సేకరించి మృతుడు గోపవరం మండలం బెడుసుపల్లె ఎస్సీకాలనీకి చెందిన మొద్దుతిరుపాల్ (46)గా గుర్తించారు. మృతుని భార్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిసింది. అనంతరం విషయం తెలుసుకున్న బంధువులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

అన్నదానం

కాశినాయన : మండలంలోని ఓబులాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవా శ్రమంలోని శనివారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. సగిలేరు ఒడ్డున మంచి వాతావరణంలో వృద్ధాశ్రమం నిర్మించి వృద్ధులకు సేవ చేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి దంపతులకు దాతలు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్లుప్తంగా

నేడు మండల సమావేశం

అట్లూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి భాస్కర్‌బాబు తెలిపారు. ఈ సమావేశం స్థానిక స్త్రీశక్తి సభా భవనంలో ఉదయం 10–30 గంటలకు నిర్వహిస్తామని శనివారం విలేకరుల సమావేశంలో ఆయన ప్రకటించారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

కలసపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 4వ తేదీన ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శివశంకర్‌రెడ్డి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు పనులను పరిశీలించి విచారణ జరిపారని, వాటిపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాల్గుణమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి వేకువజాము నుంచి కుంభమేళా త్రివేణి సంగమం (యమున, గంగ, సరస్వతి నదుల కలయిక) నదుల జలంతో స్వామివారికి అభిషేకం, సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు పలు రకాల పూలమాలలతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వచ్చిన భక్తులకు త్రివేణి సంగమం జలాన్ని అందించారు. కుంభమేళా నుంచి వచ్చిన నదీ జలాన్ని సంప్రోక్షణ చేసిన తర్వాత స్వీకరించడం చాలా ఆనందంగా ఉందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అర్జీలు పరిష్కరించండి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కాశినాయన : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండలాధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి నెలలు గడుస్తున్నా ఇంత వరకు పరిష్కరించలేదని విమర్శించారు. భూముల ఆన్‌లైన్ కోసం, ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలు తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ బద్వేలు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు జాకోబ్, మండల నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పోరుమామిళ్ల: సమాజంలో సైబర్ నేరగాళ్లు పెరిగి పోతున్నారని, అపరిచిత వ్యక్తుల ఫోన్లు అమాయక ప్రజలను నిలువునా ముంచుతున్నాయని, అందరూ జాగ్రత్తగా ఉండాలని రంగసముద్రం స్టేట్‌బ్యాంక్ మేనేజర్ నరేంద్ర హెచ్చరించారు. శనివారం బ్యాంకులో సైబర్ నేరాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతున్నారని, ఎప్పటికప్పుడు కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన బాబు కల్చరల్ ఈవెంట్స్ వారు మ్యాజిక్ షో, వీధినాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్‌గా డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో పనిచేసి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్య సదుపాయాలు మెరుగుపడేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. రోగులకు మెరుగైన చికిత్స అందేలా చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వంటేరు ప్రతాపరెడ్డి వరుణ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ ఉర్దూ, భావన, నారాయణ, దీప్తి, అభ్యాస్, గీతం, విజ్ఞాన్, శ్రీవిద్య జూనియర్ కళాశాలలు మొత్తం 9 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2,250 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొదటి రోజు శనివారం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతంలో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు

బద్వేలు అర్బన్ : ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం పట్టణంలో పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడు కూడా ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఎస్‌కేపీ జూనియర్ కళాశాల, గౌతమ్, బీజేఎస్‌ఆర్,


పరీక్షా కేంద్రంలోకి వస్తున్న విద్యార్థులు

గాయత్రి జూనియర్ కళాశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. మొత్తం నాలుగు కేంద్రాలలో 1,162 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,079 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఆయా కేంద్రాల్లో 83 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 8–30 గంటలలోపే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో విద్యార్థులు నిర్ణీత సమయంలోపే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కొన్ని కేంద్రాలలో ఒకరిద్దరు విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకునేందుకు పరుగులు తీస్తూ రావడం కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పట్టణ పోలీసులు 144 సెక్షన్‌తో పాటు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి

అట్లూరు: సేంద్రియ సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని, అందువల్ల ఈ పద్ధతిపై రైతులు మొగ్గుచూపాలని రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అధికారి వెంకట సునీల్‌కుమార్‌రెడ్డి, బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. అట్లూరు మండల పరిధిలోని కామసముద్రం గ్రామంలో ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ కోసం పురుగు మందుల అవశేషాల విశ్లేషణ కోసం జొన్నలను సేకరించామని తెలిపారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో ఒంటిమిట్ట ఏకశిలా రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో పరిశీలిస్తామని పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి రైతు ఉత్తమ యాజమాన్య పద్ధతులను ఆచరిస్తూ సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. రైతుల పంటల ఉత్పత్తుల నమూనాలను సేకరించి వాటిని విశ్లేషించి అర్హత గలిగిన


జొన్నలను పరిశీలిస్తున్న అధికారులు

రైతులకు స్కోప్ సర్టిఫికెట్ సదరు ధ్రువీకరణ సంస్థ ద్వారా జారీ చేస్తామని తెలిపారు. దీని ద్వారా మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించుకునేందుకు సౌకర్యం లభిస్తుందన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : ముస్లింలకు పవిత్ర మాసమైన రంజాన్ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. శనివారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో ముస్లింలు రంజాన్ ఉపవాసాలకు సిద్ధమయ్యారు. రంజాన్ మాసపు నెలవంక కనిపించగానే ముస్లింలు ఒకరికొకరు చాంద్ ముబారక్ తెలుపుకొని పవిత్రమైన రంజాన్ మాస ఉపవాస దీక్షలను ప్రారంభించడం ఆనవాయితీ. నెలవంక కనిపించగానే తరావీహ్ నమాజ్‌తో రంజాన్ మాసాన్ని ప్రారంభించారు. ఆదివారం నుంచి ఉపవాసాలు ఆచరిస్తారు. చిన్న పిల్లలు మొదలు వృద్ధుల వరకు నెల రోజులపాటు ఉపవాసాలను నియమనిష్ఠలతో ఆచరిస్తారు. రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని అన్ని మసీదులను అందంగా ముస్తాబు చేశారు. మసీదుల ప్రాంగణాన్ని శుభ్రం చేయడంతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులోని మక్కా మసీదు, గవిని సర్కిల్‌లోని జామియా మసీదు, వన్‌టౌన్ పరిధిలోని మట్టిమసీదు, ఖాదర్ హుసేన్ మసీదుతో పాటు పలు మసీదులు రంజాన్ సందర్భంగా నూతన శోభను సంతరించుకున్నాయి. పలు ప్రధాన మసీదుల్లో నెల రోజుల పాటు వేకువ జామున ఉపవాసాలు ఉండేవారికి షెహరి ఏర్పాటు చేయనున్నారు.

చంద్రబాబు వంచన బయటపడింది

- రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టేలా బడ్జెట్
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: చంద్రబాబు ప్రజలను ఏ విధంగా వంచిస్తారో బడ్జెట్‌లో కేటాయింపులే సాక్ష్యమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ చూస్తే రాష్ట్రాన్నం సంక్షోభంలోని నెట్టాలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మ ఒడి పథకాన్ని పేరు మార్చిన ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులను ఏమార్చేందుకు సిద్ధమయిందని, ఎన్నికల ముందు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ. 15 వేలు అంటూ ఊదరకొట్టింద


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

ని, అధికారంలోకి వచ్చాక కాలయాపన చేస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమ్మ ఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేశారని, 2019 నుంచి నాలుగు విడతలుగా రూ.1,358 కోట్లు తల్లుల ఖాతాలో జమ చేశారని గుర్తుచేశారు.

ఆర్థిక పరిస్థితిపై సాకులు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని సాకులు చెపుతూ ఒక ఏడాది కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పుడు తల్లికి వందనం పథకానికి కేటాయించిన నిధులను గమనిస్తే పెద్ద సంఖ్యలో విద్యార్థులకు కోత పెట్టేందుకు తెర వెనుక కుట్రలు చేస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. రైతు భరోసాపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన చంద్రబాబు.. తాము అధికారంలోకి వస్తే కేంద్రం ఇచ్చేది కాకుండా రూ. 20 వేలు ఇస్తామని ప్రకటించి రైతులను మోసం చేస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవలో రూ. 10,706 కోట్లు అవసరం కాగా కేవలం రూ. 6300 కోట్లు కేటాయించి మిగతాది కేంద్రం ఇచ్చేదాంట్లో సర్దుబాటు చేస్తామంటున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, మండల కన్వీనర్ సిఎం బాషా, వైస్ ఎంపీపీ రాజశేఖర్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజీవ్‌బాషా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి నరసింహులు, విద్యార్థి నాయకుడు సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో శిశువు మృతి

ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్‌మాదిగ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో పురిటిలోనే శిశువు మృతి చెందినట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్‌మాదిగ తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాణి అనే గర్భిణీ ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రిలో చేరిందన్నారు. శనివారం రాత్రి పురిటి నొప్పులు రాగా గైనకాలజిస్టు కాకుండా ట్రైనీ వైద్యులు ప్రసవం చేశారని పేర్కొన్నారు. ఫలితంగా బిడ్డ పురిటిలోనే చనిపోయిందని తెలిపారు. గైనకాలజిస్టు ఆస్పత్రిలో ఉన్నా వార్డుకు రాలేదన్నారు. సీనియర్ వైద్యులు కాకుండా వార్డులోని స్వీపర్లు, ట్రైనీ డాక్టర్లు


మాట్లాడుతున్న సుధాకర్ మాదిగ

కాన్పు చేయడంతోనే పసికందు మృతి చెందినట్లు ఆరోపించారు. అంతేగాక రాత్రి 11 గంటల సమయంలో తల్లి పరిస్థితి కూడా బాగలేదని, కడప రిమ్స్‌కు తీసుకెళ్లాలని చెప్పారని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుపులేటి శివకృష్ణ, నారాయణ స్వామి, రాజేశ్వరి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వ్యవసాయానికి అన్యాయం

ఖాజీపేట : రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి మొండిచెయ్యి చూపారని మైదుకూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి విమర్శించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే రూ. 6వేలు కాకుండా రూ. 20 వేలు రైతులకు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ నేడు రూ. 6వేలు కలుపుకుని రూ. 20వేలు రైతులకు ఇస్తామని చెప్పడం దాగా చేయడం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు 32 లక్షల 50 వేల మంది రైతులు ఉన్నారని తెలిపారు. వారికి రూ 20 వేలు ఇవ్వాల్సి వస్తే బడ్జెట్‌లో రూ. 10,700 కోట్లు కేటాయించాలని, కానీ కేవలం రూ. 6,300 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం చూస్తే రైతులను మోసం చేయడమేనని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి, మినుము పంటలకు చీడపీడలు సోకి దిగుబడి గణనీయంగా తగ్గిందని అన్నారు.

నిరుద్యోగులను నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నిరుద్యోగులను నిరాశపరిచిందని డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీకుమార్, విశ్వనాథ్ తెలిపారు. శనివారం ప్రొద్దుటూరులోని తమ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బడ్జెట్‌పై నిరుద్యోగ యువత ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలపై నీళ్లు చల్లారన్నారు. ఒక వైపు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం, మరో వైపు రాష్ట్ర బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజలు తీవ్ర నిరాశ చెందారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. సూపర్ సిక్స్‌లో ప్రధాన భాగమైన నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. చదువుకున్న ప్రతి నిరుద్యోగికి రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారన్నారు.

రాజోలికి కేటాయింపులేవీ?

దువ్వూరు: కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ కోసం 2008లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాలో రాజోలి రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఇంతవరకు భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదని ఏపీ రైతు సంఘాల సమాఖ్య జిల్లా కన్వీనర్ చాగంరెడ్డి వీరనారాయణరెడ్డి విమర్శించారు. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు మంజూరు చేస్తారేమోనని ఆశించిన రైతులకు భంగపాటు తప్పలేదన్నారు.

ఉచిత బస్సు ఊసే లేదు

అట్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద మధ్య తరగతి ప్రజలతో పాటు నిరుద్యోగులను నిరాశపర్చిందని డీవైఎఫ్‌ఐ కడప జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని పేర్కొన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించ లేదని తప్పుబట్టారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

చాపాడు: విద్యార్థి దశ నుంచే మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ట్రైనీ డీఎస్పీ భవాని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకూ స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ పోలీసుస్టేషన్ సేవలు, అక్కడ పని చేసే సిబ్బంది విధుల గురించి తెలుసుకోవాలన్నారు. మహిళలకు ప్రభుత్వాలు ప్రత్యేకమైన రక్షణ చట్టాలు కల్పించాయని తెలిపారు. ప్రతి పోలీసుస్టేషన్‌లో ఉమెన్ డెస్క్‌ను ఏర్పాటు చేశారని దీని ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు, ఆపదలు తలెత్తినా పోలీసులను సంప్రదించాలని సూచించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ భవాని

విద్యార్థులందరూ చదువుతో పాటు సమాజం పట్ల ప్రభుత్వ అధికారుల బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు. పోలీసుల విధులు, పోలీసు స్టేషన్ ప్రాముఖ్యత, ఎమర్జెన్సీ మొబైల్ నంబర్స్, ఆయుధాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న పెద్దయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు మల్లారెడ్డి

ఖాజీపేట: ఎంతో మంది విద్యార్థుల జీవితాల ఉన్నతికి బాటలు వేసిన ఆదర్శ ఉపాధ్యాయుడు బత్తెన మల్లారెడ్డి అని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్స్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య జి. విశ్వనాథ్‌కుమార్ కొనియాడారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బత్తెన మల్లారెడ్డి జీవితంపై ఏపీ అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య రచించిన అక్షర సాగరం పుస్తకావిష్కరణ సభ ఖాజీపేటలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లారెడ్డి స్కూల్‌లో గ్రంథాలయ భవనం, అడిటోరియం ఏర్పాటు చేయడం ఆయన ఉదారతకు నిదర్శనం అన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఆయన పాత్ర మరువలేమని చెప్పారు. అనంతరం బత్తెన మల్లారెడ్డిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి, రచయిత తవ్వా వెంకటయ్య,


బత్తెన మల్లారెడ్డి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

యోగివేమన విశ్వ విద్యాలయ పాలక మండలి సభ్యుడు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి, సాహిత్య విమర్శకులు డాక్టర్ జీవీ సాయిప్రసాద్, ఏపీఎస్‌ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, డాక్టర్ పుల్లా బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

ప్రొద్దుటూరు క్రైం : తనపై అధికార కూటమి నాయకులు కత్తితో దాడి చేస్తే బెయిలబుల్ సెక్షన్ కింద కేసు ఎలా నమోదు చేస్తారని ప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. ఎర్రగుంట్ల మండలంలోని మాలేపాడు గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డిపై మట్టి తరలింపు విషయంలో అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు శుక్రవారం కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. గాయపడిన ప్రసాద్‌రెడ్డి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు విషయంలో తనకు అన్యాయం జరిగిందని అతను శనివారం విలేకరులకు తెలిపారు. ఫ్యాక్షన్ గ్రామమైన మాలేపాడులో రెండు వర్గాలు ఉన్నాయని, తనపై దాడికి పాల్పడ్డ వారికి తనతో శత్రుత్వం ఉన్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే తనను చంపేందుకు పిడి బాకుతో దాడి చేసినా ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయలేదన్నారు. కలమల్ల పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లనే తనపై హత్యా ప్రయత్నం జరిగినట్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. తనపై దాడి చేసిన మోహన్‌రెడ్డి తదితరులతో ప్రాణహాని ఉందన్నారు. జిల్లా ఎస్పీ చర్యలు తీసుకొని దాడి జరిగిన ఘటనలో సంబంధిత వ్యక్తులపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి

మల్లెం కొండేశ్వరస్వామికి రూ.8.28 లక్షల ఆదాయం

గోపవరం : శివరాత్రి సందర్భంగా నిర్వహించిన మల్లెం కొండేశ్వస్వామి బ్రహ్మోత్సవాలకు హుండీ ద్వారా రూ.8,28,883లు ఆదాయం వచ్చినట్లు బద్వేలు దేవదాయశాఖ ఈఓ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. శనివారం బద్వేలు పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని దేవదాయశాఖ కార్యాలయంలో పర్యవేక్షణాధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో మల్లెంకొండేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఆయన తెలిపారు. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి రూ.8,28,883లు హుండీ ద్వారా రాగా, 187 గ్రాముల వెండి, 10.330 గ్రాములు బంగారం వచ్చినట్లు తెలిపారు.

